

కోడూరి లీలావతీదేవి

ఏ రూపంలో అయినా కట్నాన్ని నొల్లు కోవడమే ప్రయోజకత్వం. వేల సంఖ్యతోనే వాళ్ళ అంతస్తు పెరుగుతుం దనుకుంటు న్నారు మగవాళ్ళు. మగ వాళ్ళనే ఎందు కను కోవాలి? కట్నం మొత్తం ఎక్కువైనకొలది ఆడవాళ్ళ ఆనందపు టెంపరేచర్ కూడా అంత బాగా రైజ్ అవుతూంది మరి.

**"పోస్టు సార్."**

"ఇంతేనా పోస్టు?"

"ఇంకొక్కడమంచి తేను, సార్!" పోస్టుమాన్ ఛలోక్తి విసిరాడు.

ఆ రోజు పోస్టు అంతా కలిసి ఒక్క శుభలేఖ. అంతే! ఏ పత్రికవాళ్ల దగ్గిరవించీ తన కథలకు ఆక్సెప్టెన్స్ రాలేదు. అలాగని, తగు తపాలా బిళ్లలు అంటించి పంపించిన కథలేవీ తిరిగి రానూ లేదు.

మేడ మెట్లెక్కుతూ శుభలేఖ విప్పి చూశాడు.

"చి. సౌ. సుధ బి. ఎ. ను చి. డాక్టర్ జయరావ్‌కు ..."

ఓహో! ఈ పెళ్లి గురించేగా పిన్ని నిన్న లొట్టలేస్తూ అంతగా వర్ణిం చేసింది! సుధ ఆవిడ ఆడబిడ్డ కూతురూ, తన క్లాస్‌మేటూను!

ఆ జయరావ్‌గా డెవడో! ఇంత సిగ్గుమాలినవాడేం? ఇక్కడే ఉందిగా— జిల్లా జడ్జి కొడుకని! అంతటి న్యాయ మూర్తి అన్న మాట వాళ్ల నాన్న! పాతిక వేల కట్నం. అంతా బ్లాక్! వైట్‌లో న్యాయ చట్టాలు. ఏ రూపంలోనైనా సరే కట్నాన్ని నొల్లుకోవడమే ప్రయోజ కత్వం. వేల సంఖ్యతోనే వాళ్ల-అంతస్తు పెరుగుతుం దనుకుం టున్నారు మగవాళ్లు. మగవాళ్లనే ఎందు కనుకోవాలి? సరి, ఈ సుధే ఏదో పార్టీకి తనని పిలిచింది. ఆ దృశ్యం, కాదు శ్రవ్యం మరిచిపోలేదు తను.

"హైస్కూల్లో మన సీనియర్స్ మంజులో, కోపిలా జ్ఞాపకమున్నారా?" ఒక బి. ఎ. చిన్నారి గొంతు.

"ఎందుకు లేరూ? ఆ మంజుల ఎక్కడో ఉమెన్స్ కాలేజీలో లెక్చ రర్‌గా పనిచేస్తూందటగా!" ఇంకో పొన్నారి గొంతు.

"కోమల ఫైనల్ ఎమ్. బి. బి. ఎస్. చదువుతూందిట!" ఇంకో చిట్టితల్లి తపీమని చెప్పేసింది, మిగతా వాళ్లెవరైనా ఆ విషయం చెప్పేసి తన జనరల్ నాలెడ్జిని కించ పరుస్తారేమోననే కంగారుతో.

"ఆ మంజులని మా పెద్దన్నయ్య - లెక్చరర్‌గా లేడూ అతనికీ — ఈ కోమలని మా పెదనాన్న గారి అబ్బాయి— అతనూ డాక్టరేలే అతనికీ — ఇస్తున్నారే."

"కట్నం ఎంత?" చాలా గొంతులు ఒక్కసారే ఆసక్తిని చూపించాయి.

"మా అన్నయ్యకి పది వేలు. మా పెద్దనాన్నగారబ్బాయికి పదిహేను!" గర్వంగా మోగింది ఆ చిన్నారి కంఠం.

"చదువులో, సంపాదనలో సమాన స్థాయిలో ఉన్న అమ్మాయిల దగ్గర కూడా కట్నం పుచ్చుకోవడమేనా?" చిరాకుతో తన మనస్సు మూలిగి నలిగింది.

ఏదో పట్టుచీర బరబరలాడింది పక్క గదిలో.

"ఓహోహో! పెళ్లికూతురుగారు వచ్చారు." కోరస్.

"పలభై వేల కట్నంతో ఫారిన్ రిటర్న్‌డ్‌ని కట్టేసుకున్నావు! ఏం అదృష్టం!" ఒకళ్ల తరవాత ఒకళ్ల అభినందన పరంపరలూ, కిచకిచలూ, కిలకిలలూను.

'అబ్బ, ఎంత ఆనందం వీళ్లకి! కట్నం మొత్తం ఎక్కువైన కొద్దీ వీళ్ల ఆనందపు టెంపరేచర్ అంత బాగా రైజ్ అవుతుం దన్న మాట! వీళ్లు చదువుకున్నవాళ్లేనా? 1969 బ్రాండ్ అల్ట్రా మోడరన్ సరుకేనా? అలంకరణకే కాబోలు అధునాతనం! ఈనాటి యువతీ యువకుల మనో భావాలు రాతియుగం నాటివైనా ఫరవాలేదు కాబోలు! వీళ్లకంటె మా అమ్మమ్మ, తాతయ్యలే నయం. గాంధీగారి కాలంవాళ్ళు కనక కొంతలో కొంతైనా, కొన్నైనా


మొటిమలు మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును

నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

అందమైన! అలంకరణకు!
అజంతా
నెం. 419. రు 4/-
(రిజిష్టర్డు)
ఆభరణములు ధరించండి


అజంతా గోల్డు కవరింగ్ వర్క్సు
చిలకలపూడి పోష్టు మచిలీపట్నం.2.

పండిత డి. గోపాలాచార్యులవారి
బాలప్రాశ
బిడ్డలకు
రుచికరమైన టానిక్కు
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
100 జి.ఎన్. రోడ్ మదరాసు 7

ఇంప్‌కాప్స్‌లో సమస్తమూ యంత్రాలచే నిర్వహించబడుతున్నది

దేశీయ వైద్యులు కొందరుచేరి 1944వ సంవత్సరం లోనే సహకార పద్ధతులపైన ఒక ఫార్మశీని స్థాపించారు. నికార్సయిన ఆయుర్వేద, సిద్ధ, యునానీ మందులను తయారుచేయడం, దేశీయ ఓషధులలో పరిశోధనలు సాగించడం, ప్రాచీన ఋషిగ్రంథముల సూత్రాలను ప్రామాణికం చేయడం ఈ సంస లక్ష్యాలు. భవిష్యత్తుపైన పరిపూర్ణ విశ్వాసంతో పురోగమించి, ఇప్పుడు పూర్తిగా అధునాతన పద్ధతులపై యంత్రాలతోనే మందులను తయారు చేయడం సాధించి, ప్రజలకు సేవ జేయుడానికి అర్హత సంపాదించుకున్నాయి ప్రజలను ఆరోగ్యవంతులను గాను, శక్తిమంతులనుగాను చేసి, దేశాన్ని సౌభాగ్యవంతం చేయుడానికి ఇంప్‌కాప్స్ సహాయపడుతున్నది.

కాగా ఇంప్‌కాప్స్ నికార్సయిన ఆయుర్వేద, సిద్ధ, యునానీ మందులకు పెట్టినది పేరు



IMPCOPS
ది ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మశీ & స్టోర్స్ లిడ్.,
లాటిస్ బ్రిడ్జ్ రోడ్, అడయార్, మద్రాసు-20
పెద్ద కెమిస్టులవద్ద, పెద్ద మందుల దుకాణాలలోను లభ్యం కాగలవు.
ఇతర బ్రాంచిలు: తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
20/320-ఏ. పెదిభొట్లవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
19. మెక్కు హాస్టల్ బిల్డింగ్స్, వీర సావర్కర్ రోడ్డు, హైదరాబాదు-27
maa IMP/747/M.TEL

ప్రజలందరూ ప్రియముతో ఉపయోగించుచున్నది


కృష్ణవేణి ఇంకు
సెల్లింగ్ ఏజంట్లు:
నేషనల్ ప్రొడక్ట్సు సిండికేట్
292, టి. హెచ్. రోడ్, మద్రాసు-21.



తిండికోసం  ఫోటో — ఎ. విశ్వనాథ్ (మద్రాసు - 4)

అభ్యుదయ భావాల వాసనలేనా ఉన్నాయి వాళ్లలో!'

'ఛస్, ఈ కుర్రకారు ముసలమ్మలతో పార్టీలో కూర్చోవాలనిపించ లేదు తనకి! లేచి వచ్చేస్తున్నాడు.' సుధ చూసింది.

"మా అన్నయ్య ఇప్పుడే వచ్చేస్తాడు. ప్లీజ్, వెళ్లకు" అంటూ అనునయించింది.

ఈ జ్ఞాపకాల గిరగిరలలో పిన్ని మెట్లమీద ఎదురైంది.

"ఎక్కడనుంచిరా, బాబూ, శుభలేఖ?"

ఆవిడ నొక్కసారి మింగేసేలాగ చూసి 'పెళ్లి, పెళ్లంటే చాలు పిల్లందరికీ ఎంతో సంతోషం, బాబూ! కట్నం మూటలూ, లాంఛనాల కోటాలూ ఉంటే చాలు' అని లోలోపలే గొణుక్కొని, శుభలేఖను ఆవిడ ముఖాన విసిరినంత పనిగా ఆవిడ చేతుల్లో పడేసి పైకి వెళ్లిపోయాను.

## 2

హాల్లోనుంచి మాటలు వినిపిస్తున్నాయి, మేడమీద మెట్ల వరండాలోకి.

"మన సౌమిత్రి పెళ్లిమాట తలుచుకోవేమి టక్కా! బావ ఉంటే ఈ పాటికి వాడి పెళ్లి అయిపోయి ఉండేదేనా? వాడి కేం పోటనీ? పనికిరానివాళ్లకి కూడా పెళ్లిళ్లయి పోతూ ఉంటే కట్న కానుకలతో లక్షణంగా!"

'ఓహ్! ఇంక నామీదకు తిరిగింది కథన్న మాట. ఈ శుభలేఖల సీజన్‌లో — పిన్నీ, అమ్మా కలిసి నామీద వార్ డిక్లేర్ చేస్తారులా ఉంది' అని సన్నగా నవ్వుకున్నాడు సౌమిత్రి, పంజరంలో ఉన్న పిట్టల రంగుల సొబగుల్ని చూస్తూ.

సౌమిత్రి తల్లి సుమిత్రాదేవి చెల్లెలుతో కష్టసుఖాల పురాణం విప్పింది.

"ఏం చెయ్యమంటావే, జానీ! ఎక్కడైనా సరే, కట్నం పుచ్చుకుంటావని పచ్చినవాడి మొహాన కళ్లావు కొట్టే ధైర్యం ఉన్న పిల్ల దొరికితేనే పెళ్లాడతాడుట!"

"హవ్వ!" బుగ్గలు నొక్కుకుంది సౌమిత్రి పిన్ని.

సౌమిత్రికి నవ్వు వచ్చింది.

'అప్పుడే ఏమైంది? ఇంకా చాలా ఉంది' అనుకుంటూ హుషారుగా తన గదిలోకి వెళ్లి సోఫాలో కూర్చున్నాడు, చేపల తొట్టిలోని చేపల నాట్యాన్ని చూస్తూ, కొత్త కథకు ప్లాట్ ఆలోచించుకుంటూ.

కింద హాల్లో సౌమిత్రి తల్లి పాత కథ చెల్లెలికి చెబుతూంది.

"ఏం చదువుకున్నారు?"

"బి. ఎ. పాసయ్యాను." అమ్మాయి జవాబు అందంగా, వినయంగా.

'అబ్బ, ఏం వినయ విధేయతలండీ! కాలేజీలో ఎందరు లెక్చరర్స్‌ని ఏడిపించిన బాపతో' అని అనుకున్నాడట మనవాడు మనసులో.

"పోనీ, అనుకుని ఊరుకున్నానంటావా? ఏం చెప్పమన్నావు!"

"చూడండీ, మీ పేరేమిటో నా కనవసరం" అంటూ మొదలెట్టాడు.

పెళ్లిచూపుల ప్రేక్షకులం అందరం తెల్లబోయాం.

"మీ నాన్నగారు మిమ్మల్ని పెళ్లి చేసుకుంటే నాకు పాతికవేలిస్తామంటున్నారు. ఆ సంగతి తెలుసా మీకు?"

'ఓస్! అంతేకదా! ఏదో సినిమాల్లో చూచిన కుర్రతనపు సరదా మాటల్లే' అనుకొని అందరం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాం. ముఖాముఖాలు చూచుకొని ముసిముసి నవ్వులు కుమ్మరించుకున్నాం.

"తెలుసండి"— ఓరగా చూస్తూ, చిన్నగా నవ్వుతూ చెప్పిందా పిల్ల.

ఇంక చూసుకో!

"చదివింది బి. ఎ. నా? ఎందుకూ? సిగ్గులేదూ? ఏం? — అంత కట్నమిచ్చి భర్తను కొనుక్కోవడమే గొప్పనుకున్నారా? లంచమిచ్చి నన్ను పెళ్లాడతారా? మీ నాన్న ఎన్నిలంచాలు పట్టి ఈ పాపపు మూట పోగుచేశారో, పాపం!" అంటూ బడబడా దులిపి వేశాడా పిల్లని.

ఆ పిల్ల కళ్లు నీళ్లతో నిండి పోయాయి—అవమానంతో, కోపంతో.

ఆ ఆఫీసర్ బుసలు కొట్టాడు.

అతని కొడుకు, "మిస్టర్! హద్దుమీరుతున్నారు" అని హెచ్చరించాడు.

ఇంతకీ వాడేడీ? నా డెప్పుడో కార్లో వెళ్లి కూర్చున్నాడు.

"మా వాడికి కట్నం అంటే గిట్టదండీ! అందుకే ఈ చిరాకు" అని సర్ది చెప్పుకున్నాను.

"ఆ మాట ముందే ఎందుకు చెప్పలేకపోయారమ్మా?" బూరిలా పొంగింది ఆఫీసర్ మొహం ఆనందంతో.

"ఏమిటో! మావాడి కిష్టంలేక పోయినా, మా వదిన అచ్చటాముచ్చటా కోసం..." కూడా వచ్చిన పెళ్లిళ్ల పేరమ్మ — మన పక్కింటి పార్వతమ్మ గారికి మన వాడు పెట్టిన పేరులే—సన్న సన్నగా నొక్కుతూ సర్దింది.

"సరిసరి, అలాగైతే దాని కేముంది? ఏదో మాకు తోచినది ముట్టచెబుతాం. మాక్కూ మరీ మంచిదిగా!"

"నాన్నగారూ!" గర్జనలా వినిపించింది ఆ ఆఫీసర్ కొడుకు గొంతు. "ఈ సంబంధం నా కిష్టంలేదండీ. వీరి అబ్బాయికి మతిస్థిమితం ఉన్నట్లు తోచదండీ నాకు. బంగారం లాంటి చెల్లిని కట్నం లేదుకదా అని పిచ్చివాడి కిస్తారేమిటండీ?"

"ఔనౌను. అదీ న్యాయంటే! లేకపోతే అంత ఆదర్శాలెక్కడేడిశాయి ఈ కాలంలో?"

బలవంతాన మనవాడిని పెళ్లి చూపులకు తీసుకు వెళ్లినందుకు వీడి ఆదర్శాలో, పాడో— వీడి నో పిచ్చి పుల్లాయి కింద జమకట్టి పారేశారు వాళ్లు.

కార్లో కూర్చున్నాక అంతా విని, "పాపం! ఆ ధనదాహరావుగాడు —

విన్నావా, ఆ ఆఫీసర్ కొడుక్కి మనవాడు పెట్టిన పేరు — నన్ను పిచ్చివాడనక ఇంకే మంటాడు? వరకట్నం పూర్తిగా చెల్లించలేదని పెళ్ళాన్ని పుట్టింట్లో పడేసిన ప్రబుద్ధుడు" అని నవ్విపారేశాడు.

"ఇదీ వరస ... ఏం చెప్పమన్నావ్? — ఖర్మ! అందానికి లోటా? ఆస్తికి లోటా? చదువు, సంప్రదాయాలకు లోటా?"

"నుదుటి గీతొక్కటే లోటు. అంతే. బాగుందే, తల్లీ! లేకపోతే ఏమిటే, ఇవేం బుద్ధులూ? అన్నిట్లో రత్నంలాగే ఉంటాడు. పెళ్లి దగ్గిర ఈ గోలెందుకో మరి?"

"పోనీ, కట్నాలు వద్దంటున్నాడని అందమైన, చదువుకున్న, బుద్ధిమంతురాలైన పిల్లని గౌరవ కుటుంబంలో చూడమని చెబుతున్నాను అందరితోనూ."

*

# ఉగాది వేళ

●

## పుష్యమి

ఇరులు ముసిరిన జీవితమ్మున
  ఉషోరేఖలు నివ్వటిల్లెను
ముడివడిన ముఖమండలమ్మున
మొలక నవ్వులు తాండవించెను!

మ్రోడువారిన మానసమ్మున
భావవల్లరి చివురులెత్తెను
నిరాశా నిస్పృహ లణగి నవ
నవోత్సాహము మొగ్గ తొడిగెను!

పెల్లగిలిన హృదంతరమ్మున
మధువసంతము తొంగిచూచెను
ఎండమున ఆశామరీచిక
మంద పవనమువోలె వీచెను!

బ్రతుకుబాటను నడచి బడలిన
బాటసారికి సేద తీరెను
బరువుబాధలు తొలగి బ్రతుకే
నందనోద్యానముగ మారెను!

మనసులో తూగాడు మమతలు
మల్లెపూలై విరియబూచెను
గుండెలో కోయిలలు జీవన
వల్లకిని శ్రుతిచేసి పాడెను!

వికచ నీలోత్పలద్యుతి భవి
తవ్యమునకు నివాళు లెత్తెను
ఈ శుభోదయవేళ భువి ఆ
నంద మందిరమై వెలిగించెను! *

*

"బాగానే ఉంది. చివరకి మన ఇంటా వంటా లేని పద్ధతులు వచ్చి పడుతున్నా యక్కా, నీ కొడుకు పెళ్లికి. లేకపోతే, మన పెద్దిళ్లలో ఇలాగ దిక్కుమాలిన పెళ్లిళ్ళు ఎవరికైనా జరిగాయటే, తల్లీ! నువ్వివ్వలేదూ ముప్ఫై వేలూ. ముప్ఫై వేలూ గుమ్మరిస్తేనేగా నీ అల్లుడు నీ కూతురికి మూడు ముళ్ళూ వేసింది. తన బావగార్ని చూసైనా తెలివితేటలు తెచ్చుకోలేక పోయాడా మన సౌమిత్రి?"

"కాలం మారింది. ఏం చేస్తాం?"

"ఊఁ, కాలం మారింది కనకనే ఈ కట్నాల గిరాకీ! ఫాషన్లతోపాటు ఇదో పెద్ద ఫాషనయింది. అయినా, నా కిందులో తప్పేమీ కనపడ్డం లేదు. ముద్దూ ముచ్చటానూ. ఇస్తే నమ్మా నాయనం, పుచ్చుకుంటే నమ్మా నాయనం. అంతే! మీవాడి చేష్టలు నాకేం నచ్చలేదు. నీకు కోపం వచ్చినాసరే, నన్ను నల్లెటూరి బైతని నీ కొడుకు వేళాకోళం చేసినా సరే..."

"ఇంటికే పూర్తిగా నిమా మరి."

"ఆహా! మీ వాడి నిర్వాకం ఇంకా వివకేం! అందుకేగా స్తిమితంగా కూర్చున్నదీ..."

## 3

"కట్నం పుచ్చుకోదటగా మమిత్ర వాళ్ల సౌమిత్రికి. అలాంటప్పుడు, పోనీ, మా శశిని చేసుకుంటాడేమో! అడుగు, వదినా!" ప్లీడర్ సుబ్రహ్మణ్యంగారి భార్య లాలింపు గొంతు.

"ఉస్, మెల్లిగా మాట్లాడు. ఇంత వెర్రిబాగుల దాని వేమిటే, వదినా, నువ్వు. ప్లీడరు పెళ్లానివి కూడాను! మనలో మన మాట. కట్నం పుచ్చుకోకుండా చేసుకోవడానికి ఏదో కారణం ఉండదంటావా? ఇంతకీ సౌమిత్రి కేదైనా లోటుందేమో! మనకేం తెలుసూ? ఏ అప్పో సప్పో చేసైనా పిల్లను సరైనవాడి కిద్దూ, రత్నం లాంటి పిల్ల, పాపం."

సత్యనారాయణ వ్రతం చేసుకొని, మడి చీరైనా మార్చుకోకుండానే బైఠాయించిన సుందరం అత్త గొంతు కది.

"అంత కట్నాలు అక్కర్లేని ఆదర్శవాదే అయితే, పెళ్లిచూపులకు వెళ్లడా లెందుకూ? యూనివర్సిటీలో ఏ అమ్మాయినో ప్రేమించి పెళ్లి చేసుకోవచ్చునే?" పి. యు. సి. ఫెయిలయిన సుందరమ్మత్తయ్య కూతురు సుహాసిని నవ్వు.

"ఆ అమ్మాయి కాపే రెవరు పెట్టా రమ్మా? కోతిలాగ నవ్వుతుంది" అంటాడు మనవాడు. పక్క గదిలో ఒక్క క్షణంం పడుం వాల్చుకున్న నా చెవులకు ఆ నవ్వు కోతినవ్వే అనిపించిందనుకో!

"ఆఁ, ఇతన్ని ప్రేమించడానిక ఇతనికి మగసిరి ఉండొద్దూ?"

సుందరమ్మత్తగారి గుమాస్తా కూతురు ద్రౌపది వెకిలినవ్వు.

"ఆ ద్రౌపదికి అయిదుగురు భర్తలూ, ఈ ద్రౌపదికి రోజుకు అయిదు సినిమాలు అంటాడు మనవాడు."

"నిజమే అనిపించింది. ఆ పిల్ల మాటలన్నీ ఏదో జానపద సినిమా మాటల్లా ఉంటాయి. ఆడపిల్ల — ఏమా టనాలో, ఏమా టనకూడదో కూడా తెలియకుండా మాట్లాడుతుంది."

"వ్రతం అని పనిగట్టుకొని మరీ మరీ పిలిచారు. బాగుండదని వెళ్లినందుకు వాళ్ల విందు భోజనకంటే కమ్మగానే ఉన్నాయా మాటలు."

"ఎక్కడికి వెళ్లినా వీడి గొడవే అనుకో..."

"పోనీ, ఎవర్నైనా ప్రేమించాడేమో ఈ కాలం వాళ్లలాగా — అడిగి చూడక పోయావా?"

"అడగలేదూ?"

"ఏమన్నాడు?"

"ఏమంటాడూ? ఎప్పుడూ అనేదే. నే నే అమ్మాయిని ప్రేమించాలని అనుకోవడం లేదమ్మా. అమ్మాయి సాహసాన్ని ప్రేమిస్తాను. ఏ అమ్మాయైనా సరే, కట్నం అడిగినవాడి మొహాన కళ్లాపు చల్లే ధైర్యం ఉన్న అమ్మాయైతే నేను పెళ్లిచేసుకుంటానమ్మా, ఆ అమ్మాయికి నేను నచ్చితే" అంటాడు.

"వాళ్లన్నట్టు ఇదేమన్నా పిచ్చంటావా?"

"ఊరుకో, జానీ! వాణ్ణి చిన్నప్పటి నించీ ఎరుగున్న నువ్వే ఇలాగంటే ఎలాగ?"

"బాగుంది."

## 4

సౌమిత్రి ఏదో వ్రాసుకోవడం పూర్తిచేసి మెట్ల వరండాలోకి వచ్చి చూశాడు, ఇంకా అమ్మ కాఫీ, టిఫిన్ పంపించలేదేమా అని.

అక్కా, చెల్లెలూ అలాగే కూర్చుండి పోయారు కదలకుండా, నిరాశల నిట్టూర్పుల వాతావరణంలో.

'ఇదంతా సౌమిత్రిగాడి పెళ్ళి కోసమే' అని నవ్వుకున్నాడు మనసులో.

మరుక్షణంలో జాలివేసిందికూడా లమ్మ మీద.

'కానీ, ఏం చెయ్యాలి? ఈ లోకంలో ఆదర్శాలను ఇలాగే ఏదో వంక పెట్టి అణగతొక్కేస్తూంటే—

ఏముంది?

ఏముంది, ఇదే!

ఈ రకరకాల పిశాచాలన్నీ తాండవిస్తూనే ఉంటాయి. ఒక్కడివల్ల కాకపోవచ్చు. కాని, తన కా ఆదర్శంలోనే ఆనంద ముంది.

ఏం చేయడం? —'

"చూశావా, చూశావా, సుమిత్రమ్మా! ఈ విచిత్రం" అంటూ డబ్బాలో రాళ్ళు పోసినట్టు గలగలమని హాలంతా దబదబ లాడించిన పెళ్లిళ్ల పేరమ్మ గారి గొంతు సౌమిత్రిని ఆదర్శాల ఊహాల లోకంనుంచి భూమికి దిగజార్చింది.

"చూశావా, చూశావా, సుమిత్రమ్మా!"

"చూడలేదమ్మా, పార్వతమ్మా!"

సౌమిత్రి నవ్వుకొన్నాడు, 'అబ్బో! తన దగ్గిర సీరియస్‌గా ఉండే అమ్మకీ హాస్యం తెలుసునే' అని.

"శ్రీపతి మేనకోడలు ఊర్మిళ లేదూ..."

"ఊఁ...ఉంది. ఏమయిందేమిటి?"

"ఏమవ్వాలమ్మా, పిదపకాలం కాకపోతే! పాపం, శ్రీపతి ఏదో గుమాస్తాగిరీ వెలగబెడుతూ తినో, తినకో తన నలుగురు పిల్లలతోపాటే అని తల్లీ, తండ్రీ పోతే ఈ ఊర్మిళను ఇంట్లో చేర్చాడా?"

"అయితే?"

"ఈడొచ్చిన పిల్ల అని పెళ్లి చూపులకి ఎవరో కుర్రాణ్ణి పిలుచుకొచ్చాడట ..."

"ఏం? ఆ అబ్బాయి నచ్చలేదందా?"

"సరి, అలాగంటే మామూలే. వింతేముందీ ఈకాలంలో..."

* * *

"అమ్మాయీ, నీ పేరేమిటమ్మా?" అన్నారు వాళ్ళు.

'నా పేరూ ఊరూ, అందం చందం, కులం, గోత్రం ఎందుకండీ మీకు? మీకు కావలిసింది కట్నం. అది మా మామయ్య నడగండి. మీలాంటివాళ్లతో మాట్లాడుతూ కూర్చోడానికి నాకు ఖాళీ లేదు' అని విసురుగా లేచిపోయింది."

"అదా కథ?"

"కాలం తిరగబడిపోయింది. లేకపోతే చంద్రుడి దగ్గిరకే ఎగిరి తగలడి దేవుణ్ణే ముక్కలూ చెక్కలూ చేసి పట్టుకొచ్చారటగా ఆ ముండావాళ్ళు ముగ్గురూనూ."

సౌమిత్రి పిన్ని చిరాకు పడింది.

చదువులు పెరిగినా, సంస్కారాలు అలుముకున్నా స్వార్థానికే విలువ ఇచ్చే ఈ కటిక కాలంలో తన అన్వేషణ ఫలించినట్లే అనుకున్నాడు సౌమిత్రి.

మేడమెట్లన్నీ ఒక్క అంగలో దూకేసినట్లు గబగబా దిగి వచ్చాడు.

"అమ్మా!"

"బాబూ! మరిచిపోయాను. వంటతనితో చెబుతానుండు, కాఫీ టిఫిన్ పైకి పట్టుకెళ్లమని."

"లేదమ్మా! నే నిక్కడే మీ అందరితో తీసుకుంటానమ్మా. ఇక్కడికే తెప్పించు. పేరమ్మగారికి, సారీ, పార్వతమ్మగారికి రెండు ప్లేట్లు తెప్పించు ఇంత మంచి వార్త తెచ్చినందుకు."

'పెళ్లిళ్ల పేరమ్మ' గారు తెల్లమొహం వేశారు.

"అమ్మా! ఆ శ్రీపతిగారి మేనకోడలు ఊర్మిళను నేను పెళ్లి చేసుకుంటానని కబురంపించమ్మా."

ముగ్గురు పెద్దవాళ్లు స్తబ్దులయ్యారు.

కొన్ని సెకండ్లు గడిచాక—

"అమ్మాయి అందచందాలూ, ఆస్తిపాస్తులూ, అంతస్తులూ ఏమీ చూడక్కర్లేదా, బాబూ!"

"ఏమీ అక్కర్లేదమ్మా. ఆ అమ్మాయి అంతస్తు అందరికంటె పెద్దది ఆ అమ్మాయి అందం అందరికంటె గొప్పదీ, నా దృష్టిలో."

## 5

"సౌమిత్రి పెళ్లయిందట—శ్రీపతి మేనకోడలు ఊర్మిళతో."

"నయాపైసా కట్నం లేదట."

"పిల్ల పెద్ద అందకత్తె కూడా కాదట!"

"ఏమంత పెద్దచదువు కూడా లేదట!"

ఇంకో ఎన్నో, ఎన్నో చాలా చాలా 'అట' లు అయ్యాక...

"పాపం! ఎక్కడా దొరకలేదు కాబోలు. ఏం చేస్తాడు, పాపం!"

చివరకి ఆ సమస్య నలా పరిష్కరించి పారేశారు ఓ 'పాపం'తో

ఎవ్వ రేమంటే ఏం?

*

# ధ్రువాగానము

## శనగన నరసింహస్వామి

ప్రణయమంటే వసంతమే
వసంతమంటే ప్రణయమే
తుహినయవనిక తొలగిపోయీ
జీర్ణదళములు రాలిపోయీ
తరుల శాఖలు చివురుతొడిగీ
పూలుపూచీ సౌరభంబులు
భువనమంతా పొంగులెత్తును.
మలినభావం మాసిపోయీ
స్వపరభేదం సమసిపోయీ
తరుణ జనతా హృదయవీథుల
రాగకిరణం పరిమళించీ
సృష్టిసర్వం పరవశించును.
మల్లెవిరులూ, మలయ పవనం,
కోకిలామృత కుహూగానం
వసంతమంటే ప్రణయమే
ప్రణయమంటే వసంతమే
స్వాగతమో! మలయపవనా!
స్వాగతమో! కోకిలాతిథీ!
స్వాగతమో! మధురమాధవ!
స్వాగతమో! పంచబాణా!
స్వాగతమో! మల్లికాసుమ
సుందరీ! నవరాగిణీ! *

*

ఆనందంగా జరిగింది సౌమిత్రి పెళ్లి.

హాయిగా నవ్వింది కొత్త జంట.

సౌమిత్రి పెళ్లి కథ విన్నవారికీ, కన్నవారికీ కోటి పుణ్యాలు.

కథ కంచికి వెళ్లిందో లేదో కాని, 'పెళ్లిళ్ల పేరమ్మ' గారు మాత్రం కంచి పట్టుచీరతో ఇంటికి వెళ్లారు. ★